పింఛన్‌దారులకు రూ.66.64 కోట్లు: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జనవరి 3: నంద్యాల జిల్లాలో 2,24,228 పింఛన్‌దారులకు రూ.66.64కోట్ల లబ్ధి చేకూరుస్తున్నామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పేర్కొన్నారు. బుధవారం కాకినాడ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 1 నుంచి పెంచిన పింఛన్లను ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి వర్చువల్ విధానంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసే ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ మనజీర్‌జిలానీ సమూన్, మైనార్టీ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, మార్క్‌ఫెడ్ చైర్మన్ వీపీ నాగిరెడ్డి, రాష్ట్ర హస్తకళలల డైరెక్టర్ సునీత అమృతరాజ్ వీక్షించారు.

అంగన్‌వేడి ఉద్యమం



కలెక్టరేట్ ముట్టడికి తరలి వచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 3 :

అంగన్‌వాడీల ఉద్యమం తీవ్ర రూపం దాల్చింది. ఈ నెల 5వ తేదీలోగా సమ్మె విరమించి విధుల్లో హాజరు కాకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో బుధవారం అంగన్‌వాడీల ఆందోళన ఉధృతమైంది. రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు కదం తొక్కారు. పెద్ద ఎత్తున కలెక్టరేట్‌ను ముట్టడించారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ఉన్న దీక్షా శిబిరం నుంచి వేల సంఖ్యలో అంగన్‌వాడీలు భారీ ర్యాలీ చేపట్టారు. సాయిబాబా నగర్, పెద్ద ఆసుపత్రి, నూనెపల్లె ఫ్లై ఓవర్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు, పోలీసులు, స్పెషల్ ఫోర్స్ బృందాలు కలెక్టరేట్ గేట్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమక్షంలో వేల సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు కలెక్టరేట్‌ను ముట్టడించారు. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న కర్నూలు-కడప జాతీయ రహదారిపై బైఠాయించారు. వారిని అడ్డుకోవడం పోలీసులకు తలకుమించిన భారంగా మారింది. పోలీసులు, అంగన్‌వాడీల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంగన్‌వాడీల నినాదాలతో కలెక్టరేట్ ప్రాంగణం దద్దరిల్లింది. జాతీయరహదారిపై ట్రాఫిక్ స్తంభించకుండా పోలీసులు ముందస్తుగా వాహనాల రాకపోకలను మళ్లించారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి కాన్వాయ్ రావడంతో అంగన్‌వాడీలు ఘెరావ్ చేసేందుకు ప్రయత్నించారు. పోలీసుల చొరవతో ఎమ్మెల్యే వాహనాలు వెళ్లిపోయాయి.

- బెదిరింపులకు భయపడం
- హామీలు నెరవేర్చాల్సిందే
- చర్యలు తీసుకున్నా సమ్మె కొనసాగిస్తాం
- నంద్యాలలో కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్‌వాడీలు
- పోలీసుల నిర్బంధంతో ఆందోళన తీవ్రరూపం

పోలీసుల కళ్లుగప్పి.. కలెక్టరేట్ ప్రాంగణంలోకి

కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద పోలీసులు భారీఎత్తున బారికేడ్లను ఏర్పాటు చేయడంతో పక్కనే ఉన్న వ్యవసాయ సంచాలకుల కార్యాలయ గేట్ల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు కలెక్టరేట్ ప్రాంగణంలోకి చొరబడ్డారు. ఒక్కసారిగా మహిళా పోలీసుల బృందం, స్పెషల్ ఫోర్స్ బృందాలు వారిని అడ్డుకొనేందుకు ప్రయత్నించారు. పోలీసులు రెండు వలయాల భద్రతతో ఆడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొన్నది. అంగన్‌వాడీలు కలెక్టరేట్ ప్రాంగణంలోని సెంటినరీ హాల్ ముందు బైఠాయించి నినాదాలు చేశారు. బుధవారం ఉదయం 11నుంచి సాయంత్రం 4వరకు కలెక్టరేట్ ముందు అంగన్‌వాడీల బైఠాయింపు కొనసాగింది.

ఏం చేసినా సమ్మె విరమించం

ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోందని, అయితే తాము భయపడమని, ఎంతవరకైనా ముందుకెళ్తామని అంగన్‌వాడీలు హెచ్చరించారు. తామేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడంలేదని, సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడుతున్నామని అన్నారు. 5వ తేదీ తర్వాత చర్యలు తీసుకున్నా తగ్గేదేలేదని, డిస్మిస్ చేసినా సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఇది కేవలం పోరాటంలో ఆరంభం మాత్రమేనని, మున్ముందు మరింత దూకుడుగా ఉద్యమిస్తామని పేర్కొన్నారు. సుప్రీంకోర్టుకైనా వెళ్లి హక్కులు సాధించుకుంటామని అన్నారు.



నంద్యాలలో గోడ దూకి కలెక్టరేట్‌లోకి చొరబడుతున్న అంగన్‌వాడీలు

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు..



పాదయాత్రలో అమ్మా, అక్కా, చెల్లీ అంటూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముద్దులు పెడుతూ ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయారు. హామీలు నెరవేర్చని సీఎం అధికారం నుంచి దిగిపోవాలి. లేకపోతే మేమే గద్దె దింపుతాం. మహిళలపట్ల వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని స్పష్టమవుతోంది.

\- సీతామహాలక్ష్మి, ఆళ్లగడ్డ ప్రాజెక్టు



చర్యలు తీసుకున్నా సమ్మె ఆపం



23 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోగా బెదిరింపులకు పాల్పడుతోంది. 5వ తేదీ తర్వాత చర్యలు తీసుకుంటామని బెదిరిస్తోంది. మమ్మల్ని డిస్మిస్ చేసినా సమ్మె మాత్రం ఆపే ప్రసక్తే లేదు.

\- నిర్మల, జిల్లా కార్యదర్శి,
ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్
అండ్ హెల్పర్స్ యూనియన్, నంద్యాల



కలెక్టరేట్ ప్రాంగణంలో
అంగన్‌వాడీలను నియంత్రించేందుకు
ప్రయత్నిస్తున్న పోలీసులు

రేపటి నుంచి రీ సర్వేలపై అర్జీల స్వీకరణ

- జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల (కల్చరల్), జనవరి 3: జిల్లాలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద మొదటి, రెండు విడతల్లో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జనవరి ఐదో తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించి అర్జీలు స్వీకరిస్తామని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో 11 గ్రామాలు, రెండో విడతలో 73 గ్రామాలు రీసర్వే పూర్తయ్యాయన్నారు. ఆ గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే జనవరి పదో తేదీలోగా గ్రామసభలు నిర్వహించి అర్జీలు స్వీకరిస్తామన్నారు. అర్జీల స్వీకరణపై తహసీల్దార్లు ప్రచారం చేయాలన్నారు. స్వీకరించిన అర్జీలను ఈనెల 17 నుండి 21లోపు సంబంధిత గ్రామ బృందాలు పునఃసమీక్షిస్తారన్నారు.

శ్రీశైలం దేవస్థానంలో అధికారుల మధ్య వార్

శ్రీశైలం, జనవరి 3: శ్రీశైలం దేవస్థానంలోని ఓ ఏఈవో, సూపరింటెంట్ ఉద్యోగుల మధ్య ఘర్షణ స్థానికంగా చర్చనీయాంశమైంది. దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న లడ్డూ ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్ద ఓ ఏఈవో, సూపరింటెండెంట్ స్థాయి అధికారులు ఇద్దరూ పరస్పరం విమర్శించుకుంటూ చిన్నపాటి తోపులాట జరిగినట్లుగా సమాచారం. కాగా విధినిర్వహణలో ఒకరిపై ఒకరికి సమన్వయం లోపించి ఘర్షణకు దారితీసినట్లు తెలుస్తోంది. ఆలయ ఈఓ డి.పెద్దిరాజు అందుబాటులో లేకపోవడంతో ఈ విషయంపై ఏఈవో అధికారి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. భక్తుల సౌకర్యాల కల్పనలో శ్రద్ధ కనబరచకుండా ఇరువురు ఉన్నతస్థాయి అధికారులు ఘర్షణ పడటంపై స్థానికంగా పెద్ద దుమారం చెలరేగింది. ఇదిలా ఉంటే దేవస్థానంలోని మరికొందరు ఉన్నతస్థాయి అధికారుల మధ్యకూడా అంతర్గత పోరు కొనసాగుతోంది. కాగా దేవస్థానంలోని ఉద్యోగుల మధ్య నెలకొంటున్న అంతర్గత విభేదాలను ఆలయ ఈఓ డి.పెద్దిరాజు ఎలా పరిష్కరిస్తారో వేచిచూడాలి.

టీడీపీతోనే ముస్లిం మైనార్టీల సంక్షేమం

- ప్రభుత్వ ఇంటలిజెన్స్ సర్వేలో టీడీపీకి 145 సీట్లు
- పాణ్యం ముస్లింల ఆత్మీయ సమావేశంలో శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ.షరీఫ్
- హాజరైన టీడీపీ నేతలు మాండ్ర, గౌరు దంపతులు

కల్లూరు, జనవరి 3: ముస్లిం, మైనారిటీల సంక్షేమాన్ని కాంక్షించేది టీడీపీ మాత్రమేనని శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ.షరీఫ్, ముస్లిం మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ముస్తాక్ మౌలానా అన్నారు. బుధవారం కల్లూరులోని సాయి శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో పాణ్యం టీడీపీ ఇన్‌చార్జ్ గౌరుచరిత ఆధ్వర్యంలో చేపట్టిన ముస్లిం, మైనార్టీల ఆత్మీయ సదస్సుకు ఎంఏ.షరీఫ్, మాండ్రశివానందరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన సైకో జగన్‌కు రాష్ట్రంలో నియంతృత్వ ధోరణిలో ఉన్నారన్నారు. రాష్ట్రంలో దాదాపు 50కి పైగా నియోజకవర్గాల్లో ముస్లింల ప్రాబల్యం ఉందని, ముస్లింలను ఓటుబ్యాంకుగా చూస్తున్న వైసీపీని బంగాళాఖాతంలో కలపాలన్నారు. నంద్యాల టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర, రాష్ట్ర అధ్యక్షుడు ముస్తాక్‌మౌలానా మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గంలో చంద్రబాబు చేపట్టిన అభివృద్ధి తప్ప వైసీపీ చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో పాణ్యం పరిశీలకుడు అత్తర్ ,చాంద్‌భాషా, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, తెలుగు మహిళా నంద్యాల, కర్నూలు అధ్యక్షురాలు పార్వతమ్మ, ముంతాజ్‌బేగం, ఎస్.ఫిరోజ్ ముస్లిం, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పాణ్యం ముస్లిం,మైనార్టీ ఆత్మీయ సదస్సులో దిశానిర్దేశం చేస్తున్న శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ.షరీఫ్

చేతగాని హామీలతో ముంచారు

- నంద్యాలలో మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



నంద్యాలలోని మున్సిపల్ కార్యాలయం
ఎదుట అర్ధనగ్న ప్రదర్శనలో మున్సిపల్ కార్మికులు

నంద్యాల టౌన్, జనవరి 3: చేతకాని హామీలతో రాష్ట్రాన్ని సీఎం జగన్ నిలువునా ముంచేశారని మున్సిపల్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం 9వ రోజుకు చేరుకుంది. నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులకు వర్తింపజేయాలన్నారు. జీఓ నంబరు 7 ప్రకారం స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలను అర్హులైన వారందరికీ ఇవ్వాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రగల్భాలు పలుకుతూ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీమ కోసం ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా?

- దశరథరామిరెడ్డిని విడుదల చేయాలి
- నంద్యాల శ్రీనివాస సెంటర్‌లో రైతుల రాస్తారోకో

నంద్యాల టౌన్, జనవరి 3 : రాయలసీమకు సాగునీరు దూరం కావడానికి పాలకుల విధానాలు కారణం కాదా? అని ప్రశ్నించినందుకు బొజ్జా దశరథరామిరెడ్డిని అరెస్టు చేస్తారా? అని సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వైఎస్ రెడ్డి అన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో రైతులు మానవహారంగా నిలిచి దశరథరామిరెడ్డి అరెస్టుకు నిరసనగా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వై.ఎస్.రెడ్డి మాట్లాడుతూ కొత్తపల్లి మండలం సంగమేశ్వరం వద్ద కృష్ణా నదిపై అలుగు నిర్మిస్తే సుమారు 60 టీఎంసీల నీరు నిలిచి రాయలసీమ ప్రాజెక్టులకు అందుతాయని చేపట్టిన సిద్ధేశ్వరం అలుగు ఉద్యమంలో దశరథరామిరెడ్డి మీద అన్యాయంగా కేసు నమోదు చేశారని అన్నారు. 2016 మే 31వ తేదీన సుమారు 35 వేల మంది స్వచ్ఛందంగా తరలివచ్చి సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన సందర్భంగా అక్రమ కేసు నమోదు చేసి ఇప్పుడు దశరథరామిరెడ్డిని అరెస్టు చేయడం సరికాదని అన్నారు. సీనియర్ న్యాయవాది బి.శంకరయ్య మాట్లాడుతూ గత ఏడాది కర్నాటక, ఇటీవల తెలంగాణ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృష్ణా, తుంగభద్ర నదుల నుంచి రాయలసీమకు నీరు రాకుండా చేసిందని, దీన్ని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోలేకపోయిందని విమర్శించినందుకు దశరథరామిరెడ్డిని అరెస్టు చేశారా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సాధన సమితి నాయకులు, వివిధ రైతు సంఘాల ప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతు సంఘాల నాయకులు

దశరథరామిరెడ్డిని పరామర్శించిన భూమా



నందికొట్కూరు సబ్ జైల్లో దశరథరామిరెడ్డిని
పరామర్శించడానికి వచ్చిన భూమా బ్రహ్మానందరెడ్డి

నందికొట్కూరు రూరల్ జనవరి 3 : నందికొట్కూరు సబ్ జైల్లో ఉన్న రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు దశరథరామిరెడ్డిని బుధవారం మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే దశరథరామిరెడ్డిని అరెస్టు చేసి రిమాండుకు పంపారని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బాలీశ్వరెడ్డి, కొండారెడ్డి, మాబువళి, గౌస్‌భాయ్ తదితరులు పాల్గొన్నారు.

25న చంద్రబాబు పర్యటన

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), జనవరి 3: చంద్రబాబు నాయుడు జిల్లాల పర్యటనలో భాగంగా ఈనెల 25న చలో పత్తికొండకు రా.. కదిలి రా అనే కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైఫల్యాలను ఎండగడుతూ పార్లమెంట్ జిల్లాల పర్యటనలో భాగంగా జిల్లాకు రానున్నారని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి ఆరాచకాలతో ప్రజలు అల్లాడి పోతున్నారని, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, విద్యుత్ చార్జీల పెంపు, ఆస్తి, చెత్త పన్ను, రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వ వైఫల్యం, నిరుద్యోగులకు జరిగిన అన్యాయం, ప్రతిపక్ష పార్టీలపై కేసుల నమోదు వంటి అనేక సమస్యలపై చంద్రబాబు పోరాటం చేశారని గుర్తు చేశారు. మరోసారి జగన్ అరాచక పాలనను ఎండగట్టి ప్రజలకు భరోసా ఇచ్చేందుకు జిల్లాల పర్యటనలు చేపట్టనున్నారని తెలిపారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

రాహుల్‌ను ప్రధాని చేసే లక్ష్యంతో పని చేద్దాం

వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి



సమావేశంలో మాట్లాడుతున్న మస్తాన్‌వలి

కర్నూలు(అర్బన్), జనవరి 3: రాహుల్ గాంధీని ప్రధానిని చేసే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.మస్తాన్ వలి అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జిల్లా కమిటీ అధ్యక్షుడు కే బాబురావు ఆధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల భవిష్యత్ బాగుండాలంటే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్యాకేజీ వస్తుందని తెలిపారు. నూతన నాయకత్వాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థులను ఒక చోటు నుంచి మరో చోటుకు మార్పులు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. చెల్లదనుకున్న రూపాయి మరో ప్రాంతంలో చెల్లుతుందని నమ్ముతున్నారని అన్నారు. సమీక్షలో పీసీసీ ఉపాధ్యక్షుడు ఎం సుధాకర్ బాబు, మాజీ మంత్రి మూలింటి మారెప్ప, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగ మధుయాదవ్, పీసీసీ అధికార ప్రతినిధి కరుణాకర్‌బాబు పాల్గొన్నారు.

డిగ్రీలో 13 మంది డీబార్

కర్నూలు(అర్బన్), జనవరి 3: డిగ్రీ 1, 5 సెమిస్టర్ పరీక్షల్లో 13 మంది విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కన్వీనర్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని 16 పరీక్షా కేంద్రాల్లో 1వ సెమిస్టర్‌కు 11,309 మందికి 9,940, 5వ సెమిస్టర్‌లో 7,515 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 6,804 మంది విద్యార్థులు హాజరయ్యారు.

రాఘవరాయడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ

మంత్రాలయం, జనవరి 3: వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా చేశారు. ధనుర్మాస బుధవారం సప్తమి శుభదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో బృందావనాన్ని అలంకరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఎమ్మిగనూరు, జనవరి 3: చికిత్స పొందుతూ మహబూబ్(23) బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని తీసుకొని ఎమ్మిగనూరు పట్టణంలోని శివ సర్కిల్‌కు చేరుకోగానే విషయం తెలుసుకున్న మృతుని బంధువులు, స్నేహితులు, ముస్లిం యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆందోళనకు దిగారు. దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఆందోళనకు దిగటంతో సర్కిల్‌లో ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ మోహన్ రెడ్డి శివసర్కిల్‌కు చేరుకొని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి నిందితులను త్వరలో పట్టుకొని చట్టప్రకారం శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు. మహబూబ్ మూడు రోజుల క్రితం పట్టణంలోని లక్ష్మీపేటలో గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే.

దశరథరామిరెడ్డిని విడుదల చేయాలి

కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల నిరసన



మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు

కర్నూలు(కల్చరల్), జనవరి 3: రాయలసీమ సాగునీటి సాధన సమితి కన్వీనర్ బొజ్జా దశరథరామిరెడ్డిని తక్షణమే విడుదల చేయాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం కర్నూలు కలెక్టరేట్ ముందు గల మహాత్ముని విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. రాయలసీమ ప్రజా సంఘాల సమన్వయ వేదిక కన్వీనర్ అరుణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు జగన్నాథం, విరసం నాయకుడు పాణి, సీపీఐ నాయకుడు రామకృష్ణారెడ్డి, రాయలసీమ విద్యార్థి సంఘాల నాయకులు రవికుమార్, సీమకృష్ణ, వీవీ నాయుడు, ఎస్‌డీపీఐ నాయకుడు చాంద్ బాషా, పౌర హక్కుల సంఘం నాయకుడు అల్లాబకాష్, టీడీపీ నాయకుడు పెరుగు పురుషోత్తమ రెడ్డి, విద్యావంతుల వేదిక నాయకులు భాస్కరరెడ్డి, రత్నం ఏసేపు, రాయలసీమ ప్రచురణల నిర్వాహకులు వెంకటకృష్ణ, మారుతి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీమ నీటి ప్రాజెక్టుల కోసం, సీమ హక్కుల కోసం గొంతువిప్పుతున్న నాయకులను రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేయడం అన్యాయమని అన్నారు. అన్ని ప్రభుత్వాలు రాయలసీమ సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ వున్నాయని అన్నారు. రాయలసీమ ప్రజలు రాబోయే ఎన్నికల్లో తమ ప్రజా ప్రతినిధులను సీమ సమస్యలపై నిలదీయాలని, అప్పుడే సీమ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ దిగిపోతేనే సమస్యలు పరిష్కారం: బీవీ



మున్సిపల్ కార్మికులకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, జనవరి 3: సీఎం జగన్ దిగిపోతే తప్ప మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కావని మాజీ ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి అన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. దీక్షా శిబిరానికి టీడీపీ నాయకులతో కలిసి వెళ్లి సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ముద్దుల మీద ముద్దులు పెట్టి హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకొని అధికారం చేపట్టిన జగన్ నేడు మున్సిపల్ కార్మికులతో పాటు ఇతర చిరుద్యోగుల సమ్మె చేస్తున్నా స్పందించకపోవటం దారుణమన్నారు. మాట తప్పను మడమతిప్పను అని చెప్పుకునే జగన్ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన మాట ఎలా తప్పారని ప్రశ్నించారు. నవరత్నాల పేరుతో బటన్ నొక్కుతు సంక్షేమ పథకాలు నేరుగా అందిస్తున్నాని చెబుతున్న జగన్ వీకను త్వరలో ప్రజలు నొక్కుతారన్నారు. ఇక ఉండేది వంద రోజులేనని వైసీపీకి రాష్ట్ర ప్రజలు రాజకీయ సమాధి కడతారని హెచ్చరించారు. కార్మికుల పోరాటానికి టీడీపీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ నాయకులు గోవిందు, రంగన్న, రాజు, హనీఫ్ సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ నాయకులు తిమ్మగురుడు, నాయకులు రాముడు, రాజు, ప్రసాద్, బీసీ సంఘం నాయకులు గణేష్, బాలరాజు, సత్యన్న పాల్గొన్నారు.

మామిడి, చీని మొక్కల నరికివేత

● పోలీసులకు బాధిత రైతు ఫిర్యాదు



పొలంలో నరికిన మామిడి మొక్కలను పరిశీలిస్తున్న ఎస్ఐ

రుద్రవరం, జనవరి 3: కొండమాయపల్లె గ్రామానికి చెందిన పెద్దజమాల్ అనే రైతు వెలగలపల్లె రెవెన్యూ పరిధిలోని 51, 42 సర్వే నెంబర్లలోని 1.15 ఎకరాల్లో నాటిన మామిడి, చీనీ టెంకాయ చెట్లను మంగళవారం రాత్రి నరికినట్లు బుధవారం బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. పెద్దజమాల్ రెండేళ్ల క్రితం మామిడి చెట్లు నాటారు. మామిడి 72, చీనీ 22, కొబ్బరి 51 మొక్కలు నరికినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమారు రూ.1.25 లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్ల నుంచి పెంచుతున్న ప్రతి చెట్టును నేల మొదలుకు నరికి పడేశారని రైతు బోరున విలపించారు. పొలాన్ని ఎస్ఐ పరిశీలించారు. రుద్రవరం గ్రామానికి చెందిన ఇద్దరిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రహ్లాద వరద స్వామికి గ్రామోత్సవం

ఆళ్లగడ్డ, జనవరి 3: అహోబిలంలో ప్రహ్లాద వరద స్వామికి అర్చకులు బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. అహోబిలంలో జరుగుతున్న ధనుర్మాస పూజల్లో భాగంగా ఉత్సవమూర్తులైన ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి, గోదాదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

పైసలిస్తేనే పొలం ఆన్‌లైన్

డబ్బు డిమాండ్.. రైతు గగ్గోలు

హొళగుంద, జనవరి 3: హొళగుంద మండలం గజ్జెహళ్లి గ్రామానికి చెందిన కొత్తింటి రామలక్ష్మి అనే మహిళా రైతు అనుభవంలో 393 సర్వే నెంబరులో 3.35 ఎకరాల పొలం ఉంది. అందులో 1.47 ఎకరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. రీ సర్వే చేసి ఆన్‌లైన్ నమోదు చేయాల్సిందిగా సదరు రైతు కుమారుడు భీమేష్ సర్వేయర్ శ్రీనివాసులును కోరాడు. అయితే అదే గ్రామానికి చెందిన తలారి వీరేష్ అనారోగ్యానికి గురి కావడంతో అతడి స్థానంలో విధులు నిర్వహిస్తున్న ఆయన కుమారుడు రామలింగ మిగులు భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు రూ.20 వేలు అడిగాడు. ఈ విషయం బయటకు పొక్కడంతో అప్రమత్తమైన సదరు సర్వేయర్ సర్ది చెప్పుకునేందుకు అవస్థలు పడుతున్నట్టు తెలుస్తోంది. మండల సర్వేయర్ శ్రీనివాసులును వివరణ కోరగా రైతులు ఎవ్వరికీ డబ్బులు ఇవ్వరాదని, ఈ విషయంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని అ న్నారు.

యువకుడి ఆత్మహత్య

ఉయ్యాలవాడ, జనవరి 3: మండలంలోని గోవిందపల్లె గ్రామానికి చెందిన బాల ఓబయ్య(28) ఆత్మహత్య చేసుకున్నాడు. బాలఓబయ్య డిసెంబరు 26వ తేదీన ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరించి అక్కడ చికిత్స అందించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. తల్లిదండ్రులు మృతి చెందడంతో ఓబయ్య అన్నా వదినల వద్ద ఉంటున్నాడు. మృతుడి వదిన పెద్దక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

అహోబిలంలో హుండీల లెక్కింపు

ఆళ్లగడ్డ, జనవరి 3: అహోబిలం దేవస్థానంలోని హుండీలను బుధవారం లెక్కించినట్లు ఆలయ అధికారులు చెప్పారు. ఎగువ అహోబిలం హుండీని లెక్కించగా రూ.53.51 లక్షలు, దిగువ అహోబిలం హుండీని లెక్కించగా రూ.25.48 లక్షలు, పావన క్షేత్రం హుండీని లెక్కించగా రూ.4.52 లక్షలు కానుకల రూపంలో భక్తులు సమర్పించుకున్నారని చెప్పారు.

ఇంటి స్థలం ఇవ్వలేదని నిలదీత



సమస్యను మున్సిపల్ కమిషనర్‌కు వివరిస్తున్న వృద్ధురాలు

ఎమ్మిగనూరు, జనవరి 3: పట్టణంలోని కుర్ని కమ్యూనిటీ హాలులో బుధవారం వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, కొత్తగా ఇన్‌చార్జిగా నియమితులైన మాచాని వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టా రంగయ్యతోపాటు పలువురు కౌన్సిలర్లు హాజరయ్యారు. సమావేశంలో మాచాని వెంకటేష్ మాట్లాడుతుండగా లోకేశ్వరి అనే వృద్ధురాలు తనకు స్థలం, ఇల్లు మంజూరు కాలేదని, ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలని నిలదీసింది. కంగుతిన్న అధికారులు సచివాలయం సిబ్బందికి ఆమెను వెనక్కి నెట్టాలని సూచించారు. సచివాలయం సిబ్బంది ఆమెను వెనక్కి పంపేందుకు ప్రయత్నించగా ఆమె వెళ్లకపోవటంతో ఆమెకు అడ్డంగా నిలబడ్డారు. అనంతరం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగేషప్ప, కాశీం బేగ్, కేశవరెడ్డి, బజారి, మున్సిపల్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులకు ప్రాధాన్యత ఇవ్వాలి

● మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

కర్నూలు(న్యూసిటీ), జనవరి 3: మత్స్యకారులకు అన్ని పార్టీలు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం నూతన పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో బుధవారం నిర్వహించారు. బైరెడ్డి మాట్లాడుతూ మత్స్యకారుల్లో అవగాహన ఉన్నవారికి రాజకీయ ప్రాధాన్యత కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. రాయలసీమలో అన్ని పార్టీలు మత్స్యకారులకు ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అఖిల భారత మత్స్యకార సంఘం జాతీయ ఆర్గనైజర్ ఉండవల్లి వెంకటన్న నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఫిషర్‌మెన్ కార్పొరేషన్ మాజీ స్టేట్ డైరెక్టర్ బీఎస్. నవీన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు టి. పెద్ద వీరేష్, డైరెక్టర్లు మల్లీశ్వరుడు పాల్గొన్నారు.

వలస కూలీ అదృశ్యం

హైదరాబాదులో ఘటన



గోపాల్

కోడుమూరు (రూరల్), జనవరి 3: పొట్ట చేతబట్టుకుని హైదరాబాదు వెళ్లిన వలస కూలీ అదృశ్యమయ్యాడు. మండలంలోని అనుగొండ గ్రామానికి చెందిన బోయ నారాయణ, నాగమద్దమ్మ దంపతుల కుమారుడు గోపాల్ (32) భార్య మౌనికతో కలిసి కొన్నాళ్ల క్రితం హైదరాబాదుకు వలస వెళ్లాడు. గోపాల్ తన అక్క కూతురిని వివాహం చేసుకున్నాడు. హైదరాబాదులో తన బావ బేల్దారి పనులు చేస్తుండటంతో గోపాల్ దంపతులు అక్కడికి వలస వెళ్లాడు. గత ఆదివారం స్వగ్రామం అనుగొండలో పని ఉందని అక్కాబావల దగ్గర తన భార్య మౌనికను వదిలిపెట్టి బయలుదేరాడు. అయితే నాలుగు రోజులు గడిచినా స్వగ్రామం చేరలేదు. గోపాల్ అనుగొండ చేరలేదన్న విషయం తెలుసుకున్న భార్య, అక్క, బావ ఆందోళనకు గురై అక్కడ స్థానిక రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇక్కడ తల్లిదండ్రులు కుమారుడి ఆచూకీ కోసం బంధువుల దగ్గర ఆరా తీశారు. గోపాల్ ఆచూకీ ఎక్కడా దొరకలేదు. కుమారుడి కోసం వృద్ధ తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

కిరాణ దుకాణంలో షార్ట్ సర్క్యూట్

- రూ.3 లక్షల ఆస్తి నష్టం

మంత్రాలయం, జనవరి 3: మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో ఈడిగ గోపాల్‌కు చెందిన కిరాణ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ జరిగింది. మంగళవారం రాత్రి జరిగింది. అందరూ నిద్రిస్తున్న సమయంలో దుకాణంలో నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో గ్రామస్తులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. మాధవరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ శ్రీనివాసులు సంఘటనా స్థలాన్ని చేరుకొని ఎమ్మిగనూరు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. బుధవారం మంచాల సింగిల్ విండో అధ్యక్షులు ప్రదీప్ రెడ్డి బాధితులను పరామర్శించారు.

నిజామాబాద్ వాసి మృతి

మంత్రాలయం, జనవరి 3: కల్లుదేవకుంట గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తెలంగాణ వాసి గురువారం మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లా మద్నూరు మండలం కెరూరు గ్రామానికి చెందిన బకరే ఖుషాల్ (36) విషయం తెలుసుకున్న మంత్రాలయం సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్ రాజు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతునికి మతిస్థిమితం లేదని తెలుస్తోంది. బుధవారం అర్ధరాత్రి మంత్రాలయం నుంచి ఎమ్మిగనూరుకు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని ఢీకొట్టింది. మృతదేహంపైనే అనేక వాహనాలు పోవడంతో మృతదేహం చెల్లాచెదురైంది. ఆధార్ కార్డు ఆధారంగా బంధువులకు సమాచారం ఇచ్చారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వేణుగోపాల్ రాజు తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలి

నంద్యాల (నూనెపల్లె), జనవరి 3: సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని సీఐటీయూ, సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు అన్నారు. నంద్యాలలో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరసన దీక్షలు 15వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరం నుంచి ర్యాలీగా వెళ్లి డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కేజీబీవీ ఉపాధ్యాయినీల పట్ల డీఈవో తీవ్ర స్వరంతో బెదిరించడంపై భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు పోరాటం చేస్తుంటే బెదిరింపుల ధోరణి సరైనది కాదని అన్నారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

ఫుట్‌బాల్‌లో 'శాంతిరామ్'కు ద్వితీయ స్థానం

పాణ్యం, జనవరి 3 : మండలంలోని శాంతిరాం కళాశాల విద్యార్థులు ఫుట్‌బాల్ క్రీడల్లో ద్వితీయ స్థానం పొందినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత నెల 29 నుంచి 31వ తేదీ వరకు నంద్యాల ఫుట్‌బాల్ అసోసియేషన్ నిర్వహించిన నంద్యాల ఫెస్టివ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ (7ఏ సైడ్) సీనియర్స్ విభాగంలో నంద్యాల జట్టుపై 3 - 1 తేడాతో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ క్రీడలో కళాశాలకు చెందిన అఖిల్‌కుమార్, పణిచంద్ర, చంద్రసాయి, శరత్‌చంద్ర, రాజశేఖర్, సునీల్‌కుమార్, రాకేష్, దనీష్‌యాదవ్‌లు పాల్గొన్నారన్నారు.

హ్యాండ్‌బాల్ జాతీయ జట్టుకు ఆర్జీఎం విద్యార్థి ఎంపిక

హ్యాండ్ బాల్ జాతీయ జట్టుకు ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విద్యార్థి బి. యాదవేంద్ర ఎంపికైనట్లు తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 30వ తేదీన పులివెందుల జేఎన్‌టీయూ కళాశాలలో నిర్వహించిన జాతీయ హ్యాండ్‌బాల్ జాతీయ జట్టు ఎంపిక పోటీలలో విద్యార్థి ఎంపికైనట్లు తెలిపారు.

5వ తేదీ నుంచి తప్పులపై రీసర్వే

పాణ్యం, జనవరి 3 : మండలంలో జరిగిన భూ సమగ్ర సర్వేలో జరిగిన తప్పులపై రీసర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు శ్రీనివాసులుగౌడ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ నుంచి ఆరు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5వ తేదీన సుబ్బరాయుని కొత్తూరు, కౌలూరు, 6న గోరుకల్లు, 8న తమ్మరాజుపల్లె, 9న గోనవరం 10 న చిలకల గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి తప్పుఒప్పులు సరిచేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఒంగోలు జాతి కోడె దూడల బహిరంగ వేలం

మహానంది, జనవరి 3: మహానంది సమీపంలోని వెంకటేశ్వర పశు విశ్వ విద్యాలయం పరిధిలోని ఎంసీ ఫారం పశు పరిశోధన స్థానం ఒంగోలు జాతి కోడె దూడలకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 6 లక్షల 18 వేల 500 ఆదాయం వచ్చినట్లు పశు పరిశోధన కేంద్రం సీనియర్ హెడ్ శాస్త్రవేత్త ధర్మారావు తెలిపారు. ఇందులో 61 ఒంగోలు జాతి కోడె దూడలకు కేంద్రం ఆవరణలో బహిరంగవేలం జరుపగా రైతులు అధికంగా పాల్గొన్నారని చెప్పారు. ఇందులో ఒక సంవత్సరం కోడెదూడ నెంబర్ 1654 అత్యధికంగా రూ. 35,500 వేలంలో రైతు పాడుకొన్నారని అన్నారు. ఈ వేలాల్లో పశుపోషణ కేంద్రం యూనివర్సిటీ శాస్త్రవేత్తలు డాక్టర్ సురేష్‌బాబు, సుధాకర్‌రెడ్డి, సర్తజ్ పాల్గొన్నారు.

ఇద్దరు వేటగాళ్లకు జరిమానా

మహానంది, జనవరి 3: మహానంది మండలం నల్లమల అడవిలో అడవిపందిని వేటాడి చంపిన ఇద్దరు వేటగాళ్లకు రూ. 80 వేల జరిమానా విధించినట్లు చలమ రేంజ్ ఆఫీసర్ ఈశ్వరయ్య బుధవారం తెలిపారు. మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన చిన్న ఓబులరాజు, రాజేష్ ఇటీవల గాజులపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో అడవిపందిని వేటాడి హతమార్చారన్నారు. వేటగాళ్లను అదుపులోకి తీసుకొన్నామన్నారు. ఒక్కొక్కరికి రూ.40 వేల ప్రకారం ఇద్దరికి రూ.80 వేలు జరిమానా విధించినట్లు ఎఫ్ఆర్వో ఈశ్వరయ్య చెప్పారు.

సిద్ధాపురం చెరువు నుంచి సాగు నీరందించాలి

● రైతు సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో



పట్టణంలో రాస్తారోకో చేపడుతున్న రైతు సంఘం నాయకులు

ఆత్మకూరురూరల్, జనవరి 3 :వెలుగోడు రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల ద్వారా సిద్ధాపురం చెరువుకు నీటిని వదిలి తద్వారా పంట కాలువలకు సాగు నీరు విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నరసింహ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్టీసీ బస్టాండ్ ఎదుట కేజీ రోడ్డుపై సిద్ధాపురం చెరువు ఆయకట్టు రైతులతో కలిసి వారు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ముష్టిపల్లి, సిద్దపల్లి, బాపనంతాపురం, నల్లకాలువ, కొత్తరామాపురం, కరివేన గ్రామాలకు చెందిన సిద్ధాపురం ఆయకట్టు కింద రైతులు వివిధ రకాల పంటలు సాగు చేసుకున్నారన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల రైతాంగం సాగు చేసుకున్న అన్ని రకాల పంటలు ఎండి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు నుంచి అయా గ్రామాల చెరువులకు నీటిని విడుదల చేస్తే అక్కడి భూగర్భ జలాలు పెరిగి బావులలో తగినంత నీరు ఉండి తమ పంటలను కాపాడుకునే వీలుంటుందన్నారు. పంట కాలువ ల ద్వారా సాగు నీరందించి రైతుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు శంకర్, వీరన్న సంజీవ రాయుడు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షుడు స్వామన్న, నాయకులు స్వాములు, రామ్‌నాయక్, అంబయ్య, రంగస్వామి, రైతులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగాల సాధనలో 'గురురాఘవేంద్ర'



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో డాక్టర్ దస్తగిరిరెడ్డి

నంద్యాల (నూనెపల్లె), జనవరి 3: నంద్యాలలోని గురురాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఐబీపీఎస్, ఆర్ఆర్‌బీ ఆఫీసర్స్, క్లరికల్ బ్యాంక్ ఉద్యోగాలు సాధించినట్లు గురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరిరెడ్డి తెలిపారు. బుధవారం బ్యాంక్ కోచింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 అకాడమిక్ సంవత్సరానికి రీజనల్ రూరల్ బ్యాంక్ (ఆర్ఆర్‌బీ), ఐబీపీఎస్ బ్యాంకుల్లో 115 ఆఫీసర్లు, 200కుపైగా క్లరికల్ ఉద్యోగాలు సాధించినట్లు చెప్పారు. దేశంలోనే అధికంగా బ్యాంక్ ఉద్యోగాలు సాధించిందని, 1989వ సంవత్సరం నుంచి 2023వ సంవత్సరం వరకు తమ విద్యార్థులు 42 వేల మందికిపైగా బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. ఆధునిక టెక్నాలజీతో కూడిన విద్యా విధానాలతో అద్భుతమైన ఫలితాలను సాధిస్తున్నామని అన్నారు. 2024 సంవత్సరంలో బ్యాంకింగ్ రంగంలో వేలాదిగా ఆఫీసర్స్, క్లరికల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను డాక్టర్ దస్తగిరిరెడ్డి, డైరెక్టర్ మౌలాలిరెడ్డి అభినందించారు.

ప్రభుత్వ నిరంకుశత్వంపై

అంగన్‌వాడీ అక్కల ఆగ్రహం

● నూనెపల్లె ప్లై ఓవర్ మీదుగా భారీ ప్రదర్శన

● కలెక్టరేట్ ముట్టడి, రోడ్డుపై బైఠాయింపు

● ధర్నాతో దద్దరిల్లిన నూనెపల్లె రోడ్డు

నంద్యాల (కల్చరల్), జనవరి 3: 23 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోగా నిరంకుశంగా వ్యవహరిస్తోందంటూ అంగన్‌వాడీ వర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సీఐటీయూ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం కలెక్టరేట్ ముట్టడించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీగా నూనెపల్లె ప్లైఓవర్ మీదుగా కలెక్టర్ కార్యాలయం చేరుకొని ధర్నా నిర్వహించారు. తమ న్యాయమైన కోర్కెలను నెరవేర్చడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమయిందని విమర్శించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యేసురత్నం, నాగరాజు, యూనియన్ జిల్లా నాయకురాలు నిర్మల మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్లను నెరవేర్చకపోగా 5వతేదీలోగా విధులకు హాజరు కావాలని, లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించడం దుర్మార్గమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీలను నెరవార్చాలని కోరారు. 11 డిమాండ్లలో ముఖ్యంగా కనీస వేతనం రూ.26వేలు పెంచుకోవడమే తమకు ప్రధానమని, లేదా తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగా 18వేలు, గ్రాచ్యుటీ కూడా పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పెరిగిన ఖర్చులకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. మరోవైపు ఏఐటీయూసీ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పోలీసుల మధ్య తోపులాటతో కలెక్టరేట్ రెండవ ద్వారం వద్ద అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు.



ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మున్సిపల్ కార్మికుల కష్టాలు పట్టవా?

● 9వ రోజు కొనసాగిన నిరవధిక దీక్షలు

● సమ్మెకు మాజీ ఎమ్మెల్యే బుడ్డా సంఘీభావం

ఆత్మకూరు, జనవరి 3: తొమ్మిది రోజులుగా తమ న్యాయమైన సమస్యల సాధన కోసం ఉద్యమిస్తున్న మున్సిపల్ కార్మికుల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా అని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్లు తలపెట్టిన నిరవధిక నిరాహారదీక్షలను ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ గత ఎన్నికల ముందు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన సీఎం జగన్ ఐదేళ్లవుతున్నా పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ప్రజారోగ్యం కోసం నిత్యం పాటుపడే మున్సిపల్ కార్మికుల వేదన పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులు పొదుపు చేసుకున్న పీఎఫ్ నిధులను కూడా కాజేయడం జగన్ దుష్ట పాలనకు నిదర్శనమన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మెతో ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారని, మంత్రుల చర్చలతో సమయం వృథా చేయకుండా సీఎం జగన్ తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాష, కొప్పరపు రవిప్రసాద్, అడ్వకేట్ కేశవరెడ్డి, ఆర్టీసీ రామకృష్ణ, సుబ్బరాజు, అలిహుసేన్, షాబుద్దీన్, ఇరుగదిండ్ల మురళీ, ముత్తు, నబిరసూల్, సతీష్, సీఐటీయు నాయకులు రణధీర్, రామ్‌నాయక్, ఏఐటీయూసీ నాయకులు ప్రతాప్ తదితరులు ఉన్నారు.



ఆత్మకూరులో మున్సిపల్ వర్కర్ల దీక్షకు మద్దతు తెలుపుతున్న బుడ్డా

నందికొట్కూరులో మున్సిపల్ వర్కర్ల నిరవధిక దీక్ష

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు మున్సిపల్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని సీఎం జగన్ చిత్రపటానికి వినతి పత్రం అందజేశారు. నందికొట్కూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె బుదవారం నాటికి 9 వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పరమేష్, భాస్కర్, నాగేశ్వరావు మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్ల సమస్యలను పరిష్కరించకపోతే వచ్చేఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ వలసలు



అల్లూరులో మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న దేవనూరు, నెహ్రూనగర్ వైసీపీ నాయకులు

● నియోజకవర్గంలో భారీ సంఖ్యలో టీడీపీలో చేరిక

● దేవనూరు, సుంకేసుల, నెహ్రూనగర్‌లో వైసీపీకి గండి

నందికొట్కూరు రూరల్, జనవరి 3: నియోజకవర్గంలో వైసీపీకి భారీ గండి పడింది. ఆ పార్టీ నేతల వైఖరి కారణంగా ఇక ఆ పార్టీలో కొనసాగలేమని భావించి తెలుగుదేశం పార్టీ చెంతన చేరుతున్నారు. రెండు రోజుల్లోనే దాదాపు వెయ్యిమందికిపైగా వైసీపీకి బలమైన కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. తాజాగా బుధవారం మిడ్తూరు మండలం దేవనూరు, పగిడ్యాల మండలం నెహ్రూనగర్ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్రశివానందరెడ్డి సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకున్నారు. మిడ్తూరు మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గుండం రమణారెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు నాగేంద్రుడు ఆధ్వర్యంలో వీరంతా టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మాండ్ర వారికి తెలుగుదేశం కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో మహ్మద్ ఆజాం, అల్తాఫ్ ఆలీ, అన్వర్ భాష, తాహీర్ ఆలీ, నాగేంద్రడు, షేక్‌వలి, మదన్ గోపాల్, సలీం, శివశంకర్ నాయుడు, జాకీర్ ఆలీ, అఫ్రోస్ ఖాన్, అబ్దుల్ ఘనీ, వేణుగోపాల్ వెంకటరామిరెడ్డి, రషీద్ అహ్మద్ తదితరులతో పాటు గ్రామంలో ఇంకొంతమంది కుటుంబాలు పార్టీలో చేరారు.

నెహ్రూనగర్ వైసీపీ నేతలు టీడీపీలో చేరిక...

నెహ్రూనగర్ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో బండి జయరాజు, గ్రామ నాయకులు రామస్వామి, పగిడ్యాల మండల కన్వీనర్ పలుచాని మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. శివానందరెడ్డి వారికి టీడీపీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో బీజేపీ నాయకులు శివరాముడు, వైసీపీ నాయకులు గోవిందు, లోకేష్, లింగస్వామి, గోపాలు, మద్దిలేటి, నరసింహ, ర వికుమార్, స్వామి, పక్కీరయ్య, పక్కీర్ సాహెబ్, సాంబశివుడు, రంగస్వామి, బాలీశ్వర్, కుమ్మశేఖర్, శ్రీను, రాముడు, రామస్వామి, వెంకటేశ్వర్లు, రాజేష్, మోహన్ నాయుడు, చంద్రశేఖర్, తిప్పరాజు, మధుతో పాటుగా మరికొంతమంది టీడీపీలో చేరారు.

సుంకేసుల వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక

మిడ్తూరు మండలం సుంకేసుల గ్రామంలోని వైసీపీ నాయకులు టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గుండం రమణారెడ్డి గ్రామ నాయకులు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వెంకటరమణయ్య, సుబ్బారావు, వెంగన్న, లక్ష్మిరెడ్డి, ఆచారి, బాలమద్దిలేటి, చిన్న వెంకటరమణ, పెద్దరాముడు, చిన్న రాముడు, చిరంజీవి, చంద్ర, ఆనందరివు, బాబు, జక్కయ్య, వెంకటేశ్వర్లు, వెంకటరత్నం, రాజేష్, ప్రసాద్ రాముడు,ఏసన్న, తేజ, దాసు, వెంకటయ్య, హుస్సేన్ మియ్యా, సామేలు, శ్రీరాముడు, రవి, రాజేష్, మత్తయ్య, సురేష్, కుల్లాయిస్వామి, హరి తదితరులతో పాటు గ్రామంలో మరికొంతమంది టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు.

ఆర్థిక బకాయిలు చెల్లించాలి : యూటీఎఫ్

నంద్యాల టౌన్, జనవరి 3 : ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, సుధాకర్‌లు డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాల బొమ్మల సత్రం సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ పీఎఫ్, ఏపీజీఎల్ఐ, పీఆర్‌సీ, డీఏ, సెరెండర్ లీవ్‌లు, తదితర ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలు సరైన పద్ధతి కాదని, ఉపాధ్యాయుల హక్కులను ప్రభుత్వం కాలరాయటం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఆలోచించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలే కానీ ఉద్యమాలను అణిచి వేయటం, సాచివేత వైఖరిని అవలంబించడం ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతుందని గ్రహించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్, ఐజయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే సేవలు చిరస్మరణీయం

ఆత్మకూరు, జనవరి 3: భారతీయ సంఘ సంస్కర్త, దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రీబాయి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని నలంద హైస్కూల్ కరస్పాండెంట్ ఎంవీ.చలపతి అన్నారు. బుధవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1848లో భర్తతో కలిసి జనవరి 1వ తేదీన పూణేలో మొట్టమొదటి సారిగా బాలికల పాఠశాలను ఏర్పాటు చేసిన మహోన్నతురాలని గుర్తు చేశారు. కుల వ్యవస్థ, పితృసామ్యానికి వ్యతిరేకంగా, మహిళల హక్కులు, సంక్షేమం కోసం సామాజిక బాధ్యతతో పోరాటాలు సాగించారని కొనియాడారు.

నంద్యాల (నూనెపల్లె), జనవరి 3: స్థానిక సమాజ్‌వాదీ పార్టీ కార్యాలయంలో సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించా రు. కార్యక్రమంలో సమాజ్‌వాదీ పార్టీ పశ్చిమ రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ పాండురంగ యాదవ్, సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు పెరుగు శివకృష్ణయాదవ్, జిల్లా కార్యదర్శి నక్కా రాజేష్ పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు గురుమూర్తి, ప్రధానోపాధ్యాయురాలు పార్వతి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు : మండల కేంద్రంలో ప్రజాసంఘాలు, వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యావిహార్ కరస్పాండెంట్ ఆర్ఎస్ఆర్ గోపాల్, డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ యూనియన్ నంద్యాల అధ్యక్షుడు రాయపాటి మురళీ మోహన్, కౌలురైతుసంఘం నాయకులు సామన్న, బీఎస్పీ నాయకులు స్వాములు తదితరలు పాల్గొన్నారు.



నందికొట్కూరులో సావిత్రీబాయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరురూరల్ : మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే బాలికల విద్య కోసం నిరంతరం పరితపించే వారని జిల్లా అధికారిణి ఏఎంవో లలితా కుమారి,మండల విద్యాశాఖాధికారి జానకిరాం అన్నారు. వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే 193వ జయంతిని పుస్కరించుకుని పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

బండిఆత్మకూరు: ఉపాధ్యాయులు సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని పని చేయాలని ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శింగవరం గ్రామంలో సావిత్రీ పూలే జయంతిని పురస్కరించుకొని అసీఫ్ జహానా, విజయలక్ష్మిలను శాలువా కప్పి సత్కరించారు.

గడివేముల: మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి హైస్కూల్‌లో సావిత్రిబాయిపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. రాజరాజేశ్వరి హైస్కూల్ కరస్పాండెంట్ రామేశ్వరరావు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

వైసీపీ అరాచక పాలనతో అందరికీ ఇక్కట్లే

● శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



తోటగేరిలో ప్రచారం నిర్వహిస్తున్న బుడ్డా, తదితర నాయకులు

ఆత్మకూరు, జనవరి 3: వైసీపీ అరాచక పాలనతో ఏ ఒక్క వర్గం సంతృప్తిగా లేదని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని తోటగేరిలో బాబు షూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి పర్యటించి వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ దుర్మార్గ పాలనతో రాష్ట్రం అన్ని విధాలుగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు ఆయన తోటగేరిలోని చౌడేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, టీడీపీ నాయకులు వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాష, సీ కలిముల్లా, నాగకృష్ణయ్య, కమతం సుబ్బయ్య, రామ్మూర్తి, తోట శ్రీనివాసులు, వెన్న శ్రీధర్‌రెడ్డి, సతీష్, సద్దల నరేష్, సుబ్బరాజు, రమేష్‌గౌడ్, నాగఫణీ, డ్రైవర్ రాముడు తదితరులు ఉన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి : మాజీ ఎమ్మెల్యే భూమా



7వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బ్రహ్మానందరెడ్డి

నంద్యాల (నూనెపల్లె), జనవరి 3: వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనతో 20 ఏళ్ల వెనక్కు వెళ్లామని, తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి, సంపూర్ణ సంక్షేమ పాలన సాధ్యమని టీడీపీ మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం నంద్యాలలోని 7వ వార్డు ఫరూక్‌నగర్‌లో టీడీపీని గెలిపించాలని ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ ప్రజా వ్యతిరేక పాలనతో అన్ని వర్గాల వారు విసిగి పోయారని అన్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ 6 మినీ మేనిఫెస్టో పథకాలకు ప్రజలు ఆకర్శితులవుతున్నారని, ఇచ్చిన హామీలను చంద్రబాబు తూచా తప్పకుండా అమలు చేస్తామని పేర్కొన్నారు.

టీడీపీ నాయకుడికి మాండ్ర పరామర్శ

పాములపాడు జనవరి 3 : మాజీ సర్పంచ్ టీడీపీ నాయకుడు గాండ్ల క్రిష్ణుడిని నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్రశివానందరెడ్డి బుధవారం పరామర్శించారు. వేంపెంట గ్రామంలో గత 30 సంవత్సారాలుగా టీడీపీలో కొనసాగుతూ పార్టీకి ఎనలేని సేవలు అందించారు. సంవత్సర కాలంగా అనారోగ్యంతో ఉండటంతో మాండ్ర ఆయనను కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈయన వెంట టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, జయసూర్య, హరినాథరెడ్డి, చంద్రశేఖర్, బండ్లమూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మిరప పైరు ధ్వంసం

గడివేముల, జనవరి 3 : మండలంలోని కరిమద్దెల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రమణయ్య పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు మిరప పంటను ధ్వంసం చేశారు. రమణయ్య మూడు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మిరప పైరును సాగు చేశాడు. ఈ పొలంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పంటను ధ్వసం చేస్తుండగా అటువైపు రైతుల ద్విచక్ర వాహనం వస్తుండడంతో దుండగులు పరారైనట్లు తెలిపారు. తనకు న్యాయం చేయాలని బాధితుడు రమణయ్య పోలీసులను ఆశ్రయించాడు.

బొజ్జ అరెస్టు అప్రజాస్వామికం

ఆత్మకూరు, జనవరి 3: రాయలసీమ సాగునీటి సాధన సమితి వ్యవస్థాపకుడు బొజ్జ దశరథరామిరెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికచర్యని సామాజిక రాయలసీమ మహాసభ కన్వీనర్ డాక్టర్ నాగన్న అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాయలసీమ రైతుల కన్నీళ్లను తుడిచేందుకు 2016 మే 31న సిద్ధేశ్వరం అలుగు నిర్మాణ సాధన కోసం ప్రజాఉద్యమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమానికి సీమ జిల్లాల నుంచి ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు, మహిళలు, మేధావులు వేలాది సంఖ్యలో స్వచ్ఛందంగా తరలివచ్చినట్లు పేర్కొన్నారు.

దశరథరామిరెడ్డి అరెస్టుపై కాంగ్రెస్ ఖండన

నంద్యాల టౌన్, జనవరి 3 : ఉద్యమనేత, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అక్రమ అరెస్టును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. బుధవారం నంద్యాలలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

22న ఓటర్ల తుది జాబితా విడుదల

● నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ వెంకటశివ

ఆత్మకూరు, జనవరి 3: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో వుంచుకుని జనవరి 22వ తేదిన కేంద్ర ఎన్నికల కమిషన్ తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, రైల్వే బ్రాడ్‌గేజ్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారదర్శకమైన ఓటరు జాబితాను తయారు చేసేందుకు ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు కలిగిన ఓటర్లకు ఓటును కొనసాగించుకుంటారు అనే అంశంపై స్పష్టత తీసుకునేందుకు ఇప్పటికే పోస్టు ద్వారా ఫారం- నోటీసులు పంపినట్లు పేర్కొన్నారు. ఓటర్ల నుంచి స్పష్టత వచ్చాక వారి పేరుపై ఒక్కఓటును మాత్రమే జాబితాలో ఉంచుతామని వివరించారు. బీఎల్ఓలు పోస్టు నోటీసులకు సంబంధించి ఓటర్ల నుంచి వచ్చే విలువైన అభ్యర్థను పరిగణలోకి తీసుకుని వారు కోరిన ప్రకారమే ఓటరు జాబితాలో చోటు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈప్రక్రియను జనవరి 12వ తేదిలోగా పూర్తికానుందని అన్నారు. కాగా జనవరి 22వ తేది నాటికి ఓటరు జాబితా విడుదల కానుందని వెల్లడించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఉమారాణి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ రవణమ్మ, సీనియర్ అసిస్టెంట్ జీవీ.రమణ ఉన్నారు.

రైతు సమస్యలు గాలికొదిలేశారు: టీడీపీ



కోవెలకుంట్ల: గుల్లదుర్తిలో మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లెలో ప్రచారం చేస్తున్న బీసీ ఇందిరమ్మ



చాగలమర్రి: మద్దూరులో పాల్గొన్న భూమా అఖిలప్రియ

కోవెలకుంట్ల, జనవరి 3: రైతు సమస్యలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని గుల్లదుర్తి గ్రామంలో బుధవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు కరువు కోరలతో అల్లాడిపోతుంటే వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు అధ్వానంగా ఉన్నాయన్నారు. ఎక్కడ చూసినా గుంతలుగా రోడ్లు దర్శనమిస్తున్నా మరమ్మతులు చేయడం లేదన్నారు. మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఏపీలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక బ్రతుకు తెరవుకోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2014 నుంచి 2019 వరకు గుల్లదుర్తి గ్రామంలో టీడీపీ హయాంలో రూ.343 లక్షలో అభివృద్ధి చేశామని, 200 లక్షల రుణమాఫీ రైతులకు చేశామని చెప్పారు. రూ.176 లక్షలతో సీసీ రోడ్లు టీడీపీ హయాంలో వేశామన్నారు. ఎమ్మెల్యే గ్రామంలో రూ.25 లక్షలతో మాత్రమే అభివృద్ధి పనులు చేసి ఉత్తర ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. టీడీపీ నాయకులు పరమేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శివనాగిరెడ్డి, శ్రీహరి, సర్పంచ్ శ్రీలత, గోవిందరెడ్డి, శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాముడు, వెంకటేశ్వర్లు, సుదర్శన్‌రెడ్డి, పార్థసారథి, ప్రతాప్ రెడ్డి, మండల అధ్యక్షుడు మద్దిలేటి, మండల నాయకులు డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, శేఖర్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

చాగలమర్రి: రాష్ట్ర భవిష్యత్తు టీడీపీతోనే సాధ్యమని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని మద్దూరు గ్రామంలో బుధవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రౌడీలు, గుండాలు రాజ్యమేలుతున్నారని అన్నారు. ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు నమోదు చేస్తూ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. భాగ్యనగరం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమానికి వెళ్తున్నప్పుడు వంద మంది పోలీసులను అడ్డుపెట్టి నీచరాజకీయాలు చేశారన్నారు. వైసీపీ అరాచక పాలనకు రోజులు దగ్గరపడ్డాయని, వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. 9వ తేదీన చంద్రబాబు ఆళ్లగడ్డకు వస్తున్న సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జనసేన పార్టీ నాయకులు తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ ఓబులమ్మ, మాజీ సర్పంచ్ భాగ్యలక్ష్మి, మండల కన్వీనర్ నరసింహారెడ్డి, అన్సర్‌బాషా, సల్లా నాగరాజు, గుత్తి నరసింహులు, నాయకులు సుబ్బరాయుడు, సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, ఓబయ్య, ఆంజనేయులు, ఓబులేసు, మాబువలి, వీరయ్య, వెంకటసుబ్బయ్య, మహమ్మద్‌రఫి, చాంద్‌బాష, యేసోబు, సువార్త పాల్గొన్నారు.

బనగానపల్లె: టీడీపీ అధికారంలోకి వస్తేనే పేదలందరికీ సమ న్యాయం జరుగుతుందని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. పట్టణంలోని అర్బన్ కాలనీలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. ఇందిరమ్మ మాట్లాడుతూ వైసీపీ త్వరలో గద్దె దిగడం ఖాయమన్నారు. వైసీపీ నాయకులు అవినీతిలో కూరుకుపోయారన్నారు. అన్ని వర్గాలకు వైసీపీ మోసం చేసిందని ఆరోపించారు. టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బహిరంగ సభ

శిరివెళ్ల, జనవరి 3: మండలంలో ఏప్రిల్ 1, 2022 నుంచి మార్చి 31, 2023 వరకు గ్రామాల్లో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులపై శిరివెళ్ల ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సామాజిక తనిఖీ బహిరంగ సభను అధికారులు నిర్వహించారు. డ్వామా పీడీ భాస్కర్ నాయుడు, ఎంపీడీవో కేవీ సుబ్రమణ్యం, ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం అధ్యక్షతన జరిగిన చర్చా వేదికలో తనిఖీ బృందం సభ్యులు గ్రామాల్లో గుర్తించిన లోపాలను వెల్లడించారు. ఈ సామాజిక తనిఖీలో ఉపాధిహామీ మేట్లు మస్టర్‌లలో నమోదు చేసిన తప్పులకు గాను రూ.14,234ను గుర్తించగా.. ఈ మొత్తాన్ని సంబంధిత మేట్ల నుంచి అధికారులు సభలో రికవరీ చేశారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీలు బాలాజీ నాయక్, అన్వరాబేగం, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గంగాధర్, ఈవోపీఆర్డీ నాగేంద్ర, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవోలు రామసుబ్బయ్య, విజయమోహన్, ఈసీ సుబ్బరాయుడు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: బుధవారం కోవెలకుంట్ల ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో నిర్వహించిన సామాజిక తనిఖీ బహిరంగ సమావేశంలో రూ.15వేలు రికవరీకి జిల్లా డ్వామా పీడీ రామచంద్రారెడ్డి ఆదేశించారు. మండలంలోని 17 గ్రామ పంచాయితీల్లో 2022-23 సంవత్సరంలో జరిగిన జాతీయ ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీ నిర్వహించారు. హార్టికల్చర్ అవిన్యూ ప్లాంటేషన్ మొక్కలు చనిపోవడంతో వాటిని తిరిగి రీప్లాంటేషన్ చేయాలని పీడీ ఆదేశించారు. గ్రామాల వారిగా ప్రగతి నివేదికను చదివి సామాజిక తనిఖీ బృందం చదివి వినిపించారు. ఏపీడీ సాంబశివరావు, బాలాజీనాయక్, జెఈ గంగాధర్, ఎస్‌టీపీ కన్నారెడ్డి, ఏపీవో శ్రీవిద్య, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు శ్రీముఖం అందజేత

ఆళ్లగడ్డ, జనవరి 3: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవంలో ఎగువ, దిగువ అహోబిలాల్లో జరిగే కల్యాణోత్సవంలో పద్మశాలి సంఘం వారిచే ఎన్నుకున్న సభ్యులైన ఇద్దరు దంపతులు ఉభయదారులుగా వ్యవహరిస్తారు. వారిని ఉభయదారులుగా వ్యవహరించమని పీఠాధిపతి రంగనాథయతీంద్ర మహాదేశికన్ తన ముద్రకర్తచే శ్రీముఖం ఇచ్చి నియమించాల్సి ఉంది. ఇది అనాదిగా దేవాలయంలో కొనసాగుతూ వస్తున్న సంప్రదాయం. ఈ సంప్రదాయానికి అనుగుణంగా ఈ ఏడాది మార్చి 22,23 తేదిలలో ఎగువ, దిగువ అహోబిలాల్లో జరిగే కల్యాణోత్సవంలో పద్మశాలి సంఘం వారిని ఉభయదారులుగా నియమిస్తూ అహోబిలం పీఠాధిపతి ముద్రకర్త వేణుగోపాల స్వామి శ్రీముఖం బుధవారం అందజేశారు. జీపీఏ సంపత్, పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షుడు నీలకంఠేశ్వరుడు, అధ్యక్షుడు తులసి కృష్ణ, ప్రధాన కార్యదర్శి కోటా రామయ్య, ఉపాధ్యక్షుడు కట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు

బనగానపల్లె, జనవరి 3: పట్టణంలో బీసీ గుర్రెడ్డి కాంప్లెక్స్‌లో, పాతబస్టాండ్‌లో వెలసిన హజరత్ సయ్యద్‌మీర్ అలి ఉరుసును బుధవారం దర్గా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి మతగురువుల ఆధ్వర్యంలో దర్గా వద్ద ప్రత్యేక పూలచద్దర్‌లు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాతబస్టాండ్‌లోని దర్గా వద్ద కూడా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ రాజారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే ఢిల్లీ ఖవ్వాలి కళాకారులతో ముఖాముఖి పోటీల్లో ఖవాలి నిర్వహణకు బీసీ జనార్దన్‌రెడ్డి రూ.లక్ష విరాళంగా అందించారు. ఆ నిధులతో ఖవ్వాలి కార్యక్రమాలు నిర్వహించారు.

'లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు'

ఆళ్లగడ్డ, జనవరి 3: గ్రామాల్లోని రైతులకు విద్యుత్ లో ఓల్టేజీ సమస్య పరిష్కారంలో భాగంగా విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నట్లు జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి తెలిపారు. మండలంలోని బాచేపల్లెలో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్‌ను బుధవారం వారు ప్రారంభించారు. ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళరెడ్డి, విద్యుత్ ఆపరేషన్ డీఈఈ రవికాంత్‌చౌదరి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి పాల్గొన్నారు.

'పేదల సంక్షేమమే లక్ష్యం'

శిరివెళ్ల, జనవరి 3: రాష్ట్రంలోని పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారుడు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శిరివెళ్లలోని ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుకను బుధవారం పంపిణీ చేశారు. ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం, జడ్పీ వైస్ ఛైర్మన్ నాయక్ దిల్షాద్, ఎంపీడీవో కేవీ సుబ్రమణ్యం, తహసీల్దార్ షేక్ మొహిద్దిన్, వైసీపీ మండల కన్వీనర్ ఇందూరి ప్రతాప్‌రెడ్డి, సలాం, నాయక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

'పోస్టల్ పథకాలపై అవగాహన కల్పించాలి'

ఆళ్లగడ్డ, జనవరి 3: పట్టణ, గ్రామాల్లోని ప్రజలకు పోస్టల్ శాఖ అమలు చేస్తున్న పథకాల గురించి అవగాహన కల్పించాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎ.చంద్రమౌళీశ్వరరెడ్డి సూచించారు. పట్టణంలోని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో పోస్టల్ ఏజెంట్లు, పోస్టల్ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. మైల్‌వర్సల్స్ భాస్కరరావు, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల బహిష్కరణ

ఆళ్లగడ్డ, జనవరి 3: పట్టణంలోని కోర్టులో బుధవారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. జీవో నెంబరు 512ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 2వ తేది నుంచి 12వ తేది వరకు విధులను బహిష్కరించాలని బార్ అసోసియేషన్ తీర్మానించిందని కార్యదర్శి గోపాల్‌రెడ్డి చెప్పారు. న్యాయవాదులంతా సహకరించాలని ఆయన కోరారు.

'గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి'

అవుకు, జనవరి 3: రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి భారతీదేవి సూచించారు. బుధవారం మెట్టుపల్లెలో పశువులకు టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 3నుంచి 31 వరకు గ్రామాల వారిగా పశువులకు టీకాలు వేస్తామని చెప్పారు. సిబ్బంది రాజేశ్, చరణ్, గోపాలమిత్ర హరినాథ్ పాల్గొన్నారు.

బనగానపల్లె: మీరాపురం గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని యాగొటిపల్లె పశువైద్యశాల అధికారి డాక్టర్ బ్రహ్మానందారెడ్డి, యాగంటి ఆలయ ఛైర్మన్ తోట బుచ్చిరెడ్డి బుధ వారం ప్రారంభించారు. డాక్టర్ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఈనెల 31వతేదీ వరకు ప్రతి గ్రామంలో గేదెలకు ఆవులకు టీకాలను వేస్తున్నట్లు తెలిపారు.

'జయప్రదం చేయండి'

డోన్, జనవరి 3: మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు అధ్యక్షతన జరిగే జయహో బీసీ సదస్సును జయప్రదం చేయాలని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీలను ఎలాంటి అధికారాలు, నిధులు లేకుండా చేశారన్నారు. చంద్రబాబుతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని అన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి



ప్యాపిలిలో విశ్రాంతి భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన

ప్యాపిలి, జనవరి 3: అభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఆధునికీకరించిన ప్రభుత్వ విశ్రాంతి భవనాన్ని, పార్కును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మీట్ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీరాములు, నాయకులు వెంకటేశ్వర రెడ్డి, శ్రీరామిరెడ్డి, పుల్లారెడ్డి, రాజా నారాయణమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

డోన్: పట్టణంలోని గుత్తి రోడ్డులో ఆసుపత్రి పనులను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పరిశీలించారు. క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్ పనులను పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వాకింగ్ ట్రాక్‌లో మహిళలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. సీఐటీయూ నాయకులు మంత్రి బుగ్గనకు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ రాజేష్, కౌన్సిలర్లు మహేశ్వరరెడ్డి, మల్లికార్జునరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చెర్మన్ రామచంద్రు పాల్గొన్నారు.

సావిత్రీ బాయి పూలే జయంతి



రుద్రవరం ఆదర్శ పాఠశాలలో సావిత్రీ బాయి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



చాగలమర్రిలో నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు



ఆళ్లగడ్డలో ఉపాధ్యాయినులకు సన్మానం



ప్యాపిలిలో..



కోవెలకుంట్లలో..

ఆళ్లగడ్డ, జనవరి 3: మండలంలోని పాలసాగరం ఉన్నత పాఠశాలలో సావిత్రీ బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయినులను ఏపీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. హెచ్‌ఎం మురళీధర్, సంఘం కార్యదర్శి రామకృష్ణ, ఎంఈవో శోభావివేకవతి, ఉపాధ్యాయినులు సరస్వతమ్మ, రంగమ్మ, పద్మావతి, శశికళ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాలలో సావిత్రీ బాయి చిత్ర పటం వద్ద నివాళి అర్పించారు. ఉపాధ్యాయ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్‌రావు, ఎంఈవో ప్రతాప్‌రెడ్డి, ఉయ్యాలవాడ, మాయలూరు ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు కృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, సీఆర్పీ సిద్ధమ్మ తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి, జనవరి 3: చాగలమర్రిలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో సావిత్రీ బాయి పూలే జయంతిని హెచ్‌ఎం కోటయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయినులను సన్మానించారు.

రుద్రవరం: రుద్రవరం ఆదర్శ పాఠశాల, ఉన్నత పాఠశాలలో బుధవారం సావిత్రీ బాయి పూలే జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటాలకు ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, ఎంఈవో-2 లక్ష్మి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రుద్రవరం ఉన్నతపాఠశాలలో ఎంఈవో-2 లక్ష్మిని రమణమ్మ, నాగలక్ష్మి, వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాతో సన్మానించారు. ఏపీ ఉపాధ్యా సంఘం సభ్యులు మల్లికార్జునరాజు, ప్రవీణ్‌కుమార్, రామాంజనేయులు, ఆదర్శపాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సావిత్రీ బాయి పూలే జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ ఉపాధ్యాయ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయినులు పుష్పలత, ఉమాదేవి, రీనా, తిరుపాలమ్మ, లలిత వాణీశ్వరిని సన్మానించి మెమెంటోలు అందించారు. ఎంఈవో స్వరూప, శ్రీనివాసులు, హెచ్‌ఎం రామకృష్ణ, ఆపస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత కమిటీ ఆధ్వర్యంలో సావిత్రీ బాయి పూలే జయంతిని నిర్వహించారు. ప్రిన్సిపాల్ స్వర్ణలతాదేవి, అధ్యాపకులు సీతమ్మ, అధ్యాపకులు బడేసాహెబ్, సూర్యనారాయణరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, రామకృష్ణ, నాగరాజారెడ్డి, వహీదా పాల్గొన్నారు.

డోన్ (రూరల్): చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి, యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకట సుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సావిత్రీ బాయి పూలే జయంతిని నిర్వహించారు.

ప్యాపిలి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సావిత్రీ బాయి పూలే జయంతిని నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, అధ్యాపకులు నవీన్‌పాటి, సత్యబాబు, ఓబులేసు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలో ఏపీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సావిత్రీ బాయి పూలే జయంతిని నిర్వహించారు. ఉపాధ్యాయినులు నాగేశ్వరమ్మ, హేమలత, సరోజమ్మ, బీబీని సన్మానించారు. హెచ్‌ఎం రాజయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీపతి, ఎంఈవోలు వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సౌభాగ్యమ్మ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.



బనగానపల్లెలో..



ఉయ్యాలవాడలో..



డోన్‌లో..

'కనీస వేతనం ఇవ్వాలి'



సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆళ్లగడ్డ, జనవరి 3: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ నాయకుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు బుధవారం సమ్మె చేపట్టారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

గృహ నిర్మాణ లక్ష్యాలను చేరుకోవాలి: ఈఈ

ఉయ్యాలవాడ, జనవరి 3: గృహ నిర్మాణ లక్ష్యాలను చేరుకోవాలని నంద్యాల డివిజన్ ఈఈ హరిగోపాల్ సూచించారు. బుధవారం ఉయ్యాలవాడ మండల పరిషత్ కార్యాలయంలో ఆయా సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బందితో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 15 మండలాల్లో 19,716 గృహాలు మంజూరు కాగా ఇప్పటి వరకు 11,217 గృహ నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. మిగిలినవి ఆయా దశల్లో ఉన్నాయని తెలిపారు. జనవరి చివరి నాటికి 2,713 గృహ నిర్మాలు పూర్తి చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మండలంలో 101 గృహాలు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆళ్లగడ్డ డీఈ నాగరాజు, ఏఈ నరసింహులు, మండల పరిషత్ పరిపాలనాధికారి పార్థసారధి పాల్గొన్నారు.

'రైతుల పక్షాన పోరాడితే అరెస్టు చేస్తారా?'



శిరివెళ్లలో నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

శిరివెళ్ల, జనవరి 3: రాయలసీమ ప్రాంత రైతుల పక్షాన పోరాడితే.. అరెస్టు చేస్తారా అని యర్రగుంట్ల ఎంపీటీసీ-2 కమతం జయరామిరెడ్డి, టీడీపీ బీసీ సెల్ ఆర్గనైజింగ్ నంద్యాల పార్లమెంట్ సెక్రటరీ శీలం లక్ష్మీప్రసాద్ ప్రశ్నించారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి వ్యవస్థాపకుడు బొజ్జా దశరథరామిరెడ్డి అరెస్టును ఖండిస్తూ యర్రగుంట్ల టీడీపీ కార్యాలయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి బుధవారం వారు నిరసన వ్యక్తం చేశారు. రైతులను విస్మరించిన వైసీపీకి వచ్చే ఎన్నికల్లో పరాభవం తప్పదన్నారు. జాకీర్ హుసేన్, జమాల్ బాషా, సుబ్బయ్య పాల్గొన్నారు.

భూ రీసర్వేపై గ్రామ సభలు

చాగలమర్రి, జనవరి 3: మండలంలో రెండు విడతల్లో భూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుభద్రమ్మ, డీటీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి భూరీసర్వేలో అభ్యంతరాలు ఉంటే దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. 5న చాగలమర్రి, 6న మల్లేవేముల, 8న చిన్నవంగలి, పెద్దవంగలి, 9న డి.వనిపెంట, 10న ముత్యాలపాడు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తా మని చెప్పారు. రైతులు గ్రామసభల్లో దరఖాస్తులు అందజేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

'పరీక్షా పే చర్చ'పై అవగాహన

చాగలమర్రి, జనవరి 3: చిన్నవంగలి ఉన్నత పాఠశాలలో బుధవారం పరీక్షా పే చర్చ కార్యక్రమంపై ఉపాధ్యాయులకు ఎంఈవో న్యామతుల్లా అవగాహన కల్పించారు. 12వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌లు చేసుకోవడానికి గడువు ఉందని తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి అవకాశం ఉందని తెలిపారు. హెచ్‌ఎం జీవయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టరు విడుదల

చాగలమర్రి, జనవరి 3: చాగలమర్రిలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎస్టీయూ 75వ వజ్రోత్సవ సంబరాల పోస్టరును ఎంఈవో న్యామతుల్ల బుధ వారం ఆవిష్కరించారు. ఈనెల 12, 13 తేదీల్లో వజ్రోత్సవ సంబరాలను నిర్వహిస్తున్నామని ఆ మండలశాఖ అధ్యక్షుడు మస్తాన్ బాషా, ప్రధాన కార్య దర్శి సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శి మాబుహుసేన్ తెలిపారు. రాష్ట్ర కౌన్సిలర్లు శివశంకర్, ప్రసాద్, సీనియర్ నాయకులు శేషాద్రి, రాజశేఖర్‌రెడ్డి, నరసింహులు, సురేషప్ప, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో బీసీ కార్పొరేషన్లు నిర్వీర్యం'

చాగలమర్రి, జనవరి 3: వైసీపీ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేసిందని బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ ఆరోపించారు. చాగలమర్రిలోని బీసీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో బీసీ సబ్ ప్లాన్ కింద దాదాపు రూ.40 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. నిధులు లేని బీసీ కార్పొరేషన్‌లతో నిరుద్యోగ యువతకు ఎలాంటి ఉపయోగం లేదని, వచ్చే ఎన్నికల్లో ప్రజలే వైసీపీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. బీసీ సంఘం నాయకులు కృష్ణయ్య, రామతీర్థం, వీరయ్య, సుబ్బరాయుడు, సిద్ధప్ప, చిన్నికృష్ణయ్య, రమణయ్య పాల్గొన్నారు.

'భూ కొలతలను సరి చేసుకోండి'

దొర్నిపాడు, జనవరి 3: భూమి కొలతల్లో తేడాలు ఉంటే సరి చేసుకోవాలని తహసీల్దార్ జయప్రసాద్ రైతులకు సూచించారు. బుధ వారం దొర్నిపాడు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈనెల 5న కొండాపురం గ్రామ సచివాలయంలో, 6న గుండుపాపల సచివాల యంలో సరి చేయించు కోవాలని రైతులకు సూచించారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు

ఆళ్లగడ్డ, జనవరి 3: అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు తమ డిమాండ్లను వెంటనే అమలు చేయాలని నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించే దాకా సమ్మె విరమించబోమని అన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

ఆళ్లగడ్డ, జనవరి 3: అయోధ్యలో ఈనెల 22వ తేదిన జరిగే భవ్య రామమందిర ప్రతిష్ఠను పురస్కరించుకొని అహోబిలం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ గ్రామస్థులకు పంపిణీ చేయడానికి అక్షింతలను ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలకు బుధవారం అందించారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలో అయోధ్య రాముడికి పూజ చేసిన అక్షింతలను బుధవారం ఎస్‌ఎస్‌ఎఫ్ సభ్యులు, మహిళలు పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి అక్షింతలను అందజేశారు. ఆయా వీధుల్లో మహిళలు ఇంటింటికి వెళ్లి అయోధ్యరాముడి అక్షింతలను అందజే శారు. ఈనెల 22న అయోధ్యలో బాలరాములవారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరుగుతున్న సమయంలో అక్షింతలతో పూజలు చేయాలని ఎస్‌ఎస్‌ఎఫ్ మహిళా కన్వీనర్ టి.భవానమ్మ, ఎల్.లక్ష్మీదేవి, సునిత సూచించారు.

దివ్యాంగుల నిరసన

బనగానపల్లె, జనవరి 3: సమస్యలు వెంటనే పరిష్కరించాలని దివ్యాంగులు డిమాండ్ చేశారు. బనగానపల్లె తహసీల్దారు కిశోర్‌కుమార్ రెడ్డికి బుధవారం వినతిపత్రం ఇచ్చారు. వికలాంగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాజు ఆధ్వర్యంలో ర్యాలీగా తహసీల్దారు కార్యాలయానికి వచ్చి ధర్నా చేశారు. సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



హేమంత్

ఆళ్లగడ్డ, జనవరి 3: మండలంలోని అహోబిలం గ్రామానికి చెందిన మంగలి దస్తగిరిబాబు కుమారుడు హేమంత్ అదృశ్యమయ్యాడు. గత ఏడాది డిసెంబరు 29వ తేదీ నుంచి కన్పించడం లేదని తండ్రి దస్తగిరిబాబు బుధవారం ఫిర్యాదు చేసినట్లు రూరల్ ఎస్ఐ నరసింహులు చెప్పారు. హేమంత్ నంద్యాలలోని రావూస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. విద్యార్థి ఆచూకీ తెలిసిన వారు 9121101167, 9121101166 నంబర్లకు ఫోన్ చేయాలని ఎస్ఐ తెలిపారు.